క్లుప్తంగా

ఘనంగా పోషణ మాసోత్సవం



జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్డు అంగన్‌వాడీలో...

మంచిర్యాలటౌన్/చెన్నూర్‌రూరల్: పోషణ మాసం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్డు అంగన్‌వాడీ కేంద్రం 2లో, చెన్నూర్‌రూరల్ మండలంలోని సుందరసాల, నర్సక్కపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు, గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకుని, ఆరోగ్యవంతంగా ఉండాలని సీడీపీవో విజయలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ప్రజాప్రతినిధులు సూచించారు. పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలను అందించి, ఆ తరువాత అన్నప్రాసన చేసి, సరైన పౌష్టికాహారం అందించేలా చూడాలన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్: సమగ్రశిక్షలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలో భాగంగా మంగళవారం తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మంచిర్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. క్యాంపు ఆఫీస్ ఎదుట డ్రాయింగ్ టీచర్లు కేసీఆర్ చిత్రపటం వేసి నినాదాలు చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల దీక్షకు సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, శ్రీనివాస్, హేమలత మద్దతు ప్రకటించారు. పీసీసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ సంఘీభావం ప్రకటించారు. దీక్ష శిబిరం వద్ద మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు భోజనం అందించారు.

రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలటౌన్: జిల్లా రైతుల దగ్గర ఐకేపీ సెంటర్ల ద్వారా కొనుగోలు చేసిన వడ్లను కస్టమ్స్ మిల్లింగ్ కింద ప్రజలకు పీడీఎస్ వ్యవస్థ ద్వారా ఇవ్వాల్సిన బియ్యాన్ని ఇవ్వకుండా, రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసే బియ్యంను రీసైక్లింగ్ చేస్తున్న రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి జుమ్మిడి గోపాల్, ప్రవీణ్, సాల్మాన్,క్రాంతికుమార్, నితీష్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

భీమారం: రాష్ట్రంలో ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ స్థాయిలో చదువుకుంటున్న విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని టీవీయూవీ రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులపై సవతి తల్లి ప్రేమ చూపుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యార్థుల బాధలు అర్థం చేసుకొని, విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందులో విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై ప్రత్యేక శిక్షణ



మాట్లాడుతున్న మల్లారెడ్డి

మంచిర్యాలక్రైం: రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళిపై మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ సిబ్బందికి వారంపాటు బ్యాచ్‌ల వారీగా ఇచ్చే ప్రత్యేక శిక్షణను మంగళవారం ప్రారంభించారు. ఎలక్షన్ సెల్ ఇన్‌చార్జి ఏసీపీ మల్లారెడ్డి, సీఐలు సుధాకర్, మొగిలి ఎన్నికల నియమావళిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు నిబంధనలకు లోబడి పని చేయాలని సూచించారు. నామినేషన్ దాఖలు మొదలుకొని ఎన్నికలు పూర్తయ్యే దాకా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనుమానిత ప్రాంతాలు, మద్యం, డబ్బు అక్రమ తరలింపుపై తనిఖీలు చేపట్టాలన్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చేపట్టాలని సూచించారు. రెండు జిల్లాల ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రోడ్లకు నిధులొచ్చాయ్..!

- రహదారుల విస్తరణకు రూ.35కోట్లు, మరమ్మతులకు రూ.14.28కోట్లు
- నిధుల విడుదలకు జీవో జారీ చేసిన ప్రభుత్వం
- పనులు పూర్తయితే జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పినట్లే..!



ఇరుకుగా ఏసీసీ నుంచి శ్రీనివాస గార్డెన్ వైపు వెళ్లే రోడ్డు



ఇరుకుగా ఉన్న బెల్లంపల్లి వైపు వెళ్లే రహదారి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంగా మారిన తర్వాత పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల వెడల్పు లేకపోవడంతో, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మంచిర్యాల చుట్టూ ఉన్న రోడ్లు నేషనల్ హైవే వారు అభివృద్ధి చేయగా, మంచిర్యాల పట్టణంలోకి వచ్చే రోడ్లు మాత్రం ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. 2018లో మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి రామకృష్ణాపూర్ ఎక్స్‌రోడ్డు వరకు రోడ్డు వెడల్పు చేసేందుకు రూ.35కోట్ల నిధులను కేటాయిస్తూ జీవోను విడుదల చేసినా, ఆ తరువాత రోడ్డు వెడల్పు పనులకు మోక్షం కలుగలేదు. ఇటీవలే శ్రీరాంపూర్ ఎక్స్ రోడ్డు వద్ద రింగ్ రోడ్డు వేసి నేషనల్ హైవేను రామకృష్ణాపూర్, బొక్కలగుట్ట మీదుగా వాంకిడి వరకు నేషనల్ హైవే పనులను చేపడుతూ రాకపోకలను ప్రారంభించారు. రామకృష్ణాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి మంచిర్యాల పట్టణం వరకు రోడ్డు వెడల్పు పనులను చేయకపోవడంతో, ఇరుకుగా ఉన్న రోడ్డు మీదుగానే వాహనదారులు ఇబ్బందులు పడుతూ జిల్లా కేంద్రానికి చేరుకుంటున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండడం, పూర్తిగా గుంతలుగా మారిన ఈ రోడ్డుపై వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడం, వాహనాలు పాడవుతుండడంతో, రోడ్డును వేయాలన్న డిమాండ్ ప్రజల నుంచి ఉంది.

పనులు పూర్తి చేస్తేనే...

మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి రామకృష్ణాపూర్ ఎక్స్‌రోడ్డు వరకు ఉన్న రోడ్డు ఇరుకుగా ఉంటుంది. 2018లో ఈ రోడ్డును వేసేందుకు నిధులు కేటాయించినా, ఆ తరువాత పనులు చేపట్టలేదు. ఈ నెల 1వ తేదీన జీవో 444ద్వారా రోడ్లు భవనాల శాఖ ద్వారా మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి మున్సిపల్ పరిధి ముగింపు అయిన శ్రీనివాస గార్డెన్ వరకు 3.80కిలోమీటర్ల దూరం రహదారి వెడల్పు పనులను చేపట్టేందుకు రూ.35కోట్లు కేటాయించారు. ఈ నిధులతో రోడ్డు మధ్యలో 1మీటరు వెడల్పుతో డివైడర్, సెంట్రల్ లైటింగ్, రోడ్డు మధ్యలో నుంచి ఇరువైపులా 12మీటర్లు వెడల్పు చేయడం, 6బాక్స్ కల్వర్టులు, 2బ్రిడ్జీలు నిర్మించనున్నారు. ఇందుకు గాను టెండరు ప్రక్రియను చేపట్టారు. టెండర్లు పూర్తయితే వెంటనే రోడ్డు వెడల్పు పనులను పూర్తి చేసేందుకు అవకాశం ఉంది. అయితే రోడ్డు వెడల్పు పనులకు సంబంధం లేకుండా, ఉన్న రోడ్డుకు మరమ్మతు చేసేందుకుగాను రోడ్లు భవనాల శాఖ ద్వారా రూ.14.28 కోట్లను ఇటీవలే విడుదల చేశారు. ఈ నిధులతో మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి రామకృష్ణాపూర్ ఎక్స్ రోడ్డు వరకు ఉన్న రోడ్డుపైన ఉన్న గుంతలను పూడ్చి బీటీ రోడ్డు వేయనున్నారు. ఈ పనులను త్వరగా చేపడితే, వాహనదారులకు రాకపోకల ఇక్కట్లు తప్పేందుకు అవకాశం ఉంది.

టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం..



మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి శ్రీనివాస గార్డెన్ వరకు 3.80కిలోమీటర్ల పొడువుతో రోడ్డు వెడల్పు పనులు, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, 2బ్రిడ్జీలు, 6బాక్స్ కల్వర్టుల నిర్మాణం కోసం రూ.35కోట్ల నిధులు విడుదలయ్యాయి. టెండర్లను పూర్తిచేసి, వెంటనే రోడ్డు పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ పనులు పూర్తయితే, మంచిర్యాల పట్టణంలోకి వచ్చే వాహనదారులు, పట్టణంలోని వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పనున్నాయి.

– నడిపెల్లి దివాకర్‌రావు, మంచిర్యాల ఎమ్మెల్యే

మహిళల సంక్షేమం కోసం చర్యలు

- మంచిర్యాల, నస్పూర్‌లో ఆరోగ్య మహిళా కేంద్రాలు ఏర్పాటు
- ప్రారంభించిన ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



నస్పూర్‌లో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతుందని, అందు కోసమే ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షల కోసం మహిళా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రంను ఎమ్మెల్యే ప్రారంభించారు. రాజీవ్‌నగర్‌తో పాటు, నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మహిళా ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించగా రాజీవ్‌నగర్‌లో 72మందికి, నస్పూరులో 65మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు, వార్డు కౌన్సిలర్ బుద్దార్థి సత్తమ్మ, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నీరజ, డెమో వెంకటేశ్వర్, బుద్దార్థి రాంచందర్ పాల్గొన్నారు.

నస్పూర్: రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే దివాక్‌రావు తెలిపారు. నస్పూర్ పీహెచ్‌సీలో మంగళవారం ఆయన ఆరోగ్యమహిళా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ప్రతీ మంగళవారం ఈ కేంద్రంలో ప్రత్యేక సరైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు, నిరంతరం రెఫరల్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు, జిల్లా ప్రోగ్రామింగ్ అధికారిని డాక్టర్ అనిత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమత, డాక్టర్ నీరజ, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు వంగ తిరుపతి, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



కాసిపేటలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

కాసిపేట: గ్రామాల్లో ప్రతి మహిళా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 18సంవత్సరాలు నిండిన మహిళలు ప్రతి మంగళవారం ఉచితంగా 8రకాల వైద్యపరీక్షలు చేయించుకోవచ్చునన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే మందులు ఇవ్వడం, ఆపరేషన్ అవసరం అయిన వారికి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మి, జెడ్పీటీసీ చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రంరావు, సర్పంచ్ ఆడె బాదు, దేవి కొండయ్య, కో ఆప్షన్ సభ్యుడు సిరాజ్‌ఖాన్, ఉపసర్పంచ్ బోయిని తిరుపతి, వైద్య సిబ్బంది, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులున్నారు.

నిర్దేశిత లక్ష్యాలు సాధించాలి

■ బొగ్గుబాయి వార్తలు



దేవేందర్‌ను సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాలను సాధించాలని జనరల్ మేనేజర్ మార్కెటింగ్ దేవేందర్ అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీ, శ్రీరాంపూర్ సీహెచ్‌పీని మంగళవారం ఆయన జీఎం సంజీవరెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో చేరుకోవడానికి పలు సూచనలు చేశారు. బొగ్గు క్వాలిటీని పెంచడానికి చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించాలని తెలిపారు. జీఎం మార్కెటింగ్ దేవేందర్‌ను ఏరియా జీఎం సంజీవరెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్, ఇందారం ఓసీపీ పీఓ శ్రీనివాస్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు వరలక్ష్మి, చంద్రశేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ ప్రకారం క్వార్టర్ల కేటాయింపు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: సీనియారిటీ ప్రకారం ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు జరుగుతుందని ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ పేర్కొన్నారు. ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం క్వార్టర్ల కోసం దరకాస్తు చేసుకున్న 32మంది ఉద్యోగులకు కౌన్సెలింగ్ ద్వారా సీనియారిటీ ప్రకారం క్వార్టర్లను కేటాయించామని తెలిపారు. కార్యక్రమంలో ఏజెంట్ రాందాస్, సీనియర్ పీవో ఆసిఫ్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కన్నెపల్లిలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



దండేపల్లి: మద్దతు తెలుపుతున్న డీసీసీ అధ్యక్షురాలు



నెన్నెలలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

దండేపల్లి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ డిమాండ్ చేశారు. దండేపల్లిలో రిలే దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలకు మంగళవారం ఆమె మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల న్యాయపరమైన డిమాండ్లు తీర్చాలన్నారు. డీసీసీ అధ్యక్షురాలి వెంట ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శకుంతల, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

భీమిని: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మంగళవారం ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీలు, ఆయాలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో భీమిని, కన్నెపల్లి మండలాల్లోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

నెన్నెల: తమ సమస్యలు పరిష్కరించాలని అప్పటి వరకు పోరాటం ఆగదని అంగన్‌వాడీ కార్యకర్తల మండల అధ్యక్షురాలు రాజేశ్వరి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరింది. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనం రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన



అవయవాల పనితీరు వివరిస్తున్న మధు

భీమారం: సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే సంచార ప్రయోగశాల ఏర్పాటు చేసినట్లు జిల్లా సైన్స్ అధికారి మధు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంచార సైన్స్ ప్రయోగశాల ద్వారా మంగళవారం భీమారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానవ శరీరంలోని వివిధ అవయవాల పని తీరును వివరించారు. కార్యక్రమం ద్వారా గ్రామీణ పాఠశాల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కాగా కార్యక్రమంలో హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు, సైన్స్‌ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బాలికల భద్రతే షీటీమ్ లక్ష్యం'

నెన్నెల: బాలికల, మహిళల భద్రతే షీటీమ్ లక్ష్యమని జిల్లా షీటీమ్ ఏఎస్సై ఒబులమ్మ అన్నారు. నెన్నెల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం షీటీమ్‌పై అవగాహన కల్పించారు. ఆకతాయిల ఆట కట్టించి, మహిళలకు రక్షణ కల్పించేందుకు షీటీమ్ పని చేస్తుందన్నారు. మహిళలకు ఎలాంటి సమస్యలు వచ్చినా 100కు కాల్ చేయాలని సూచించారు. లేదా టోల్ ఫ్రీ నంబర్ 181కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా షీటీమ్ సిబ్బంది సతీష్, శ్రావణ్‌కుమార్, జ్యోతి, అనంత్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకం



ఉత్తర్వులు అందుకుంటున్న హెచ్‌ఈవో జగదీశ్

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని పీహెచ్‌సీలో హెచ్‌ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న డి.జగదీశ్ హెల్త్‌అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన యూనియన్ సమావేశంలో హెల్త్‌అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్‌సుందర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి కృష్ణమోహన్ గౌడ్ చేతుల మీదుగా జగదీశ్ నియామకపత్రాన్ని అందుకున్నారు.

గొల్లపల్లిలో వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

నెన్నెల: మండలంలోని గొల్లపల్లిలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి బీపీ, షుగర్‌తో పాటు రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు ప్రభుత్వ వైద్యాధికారి లక్ష్మణ్ తెలిపారు. జ్వరపీడితుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. వాతావరణంలో మార్పుల వల్ల జ్వరాలు వస్తున్నాయని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య శిబిరంలో కార్యదర్శి రంజిత్, ఏఎంఎల్‌హెచ్‌పీ సంధ్యారాణి, ఏఎన్‌ఎం గంగ, చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అంబేద్కర్ జీవిత చరిత్ర ఆదర్శనీయం'

మంచిర్యాలటౌన్: అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ జీవితచరిత్ర ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్ రెడ్డి అన్నారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సారధ్యంలో సంఘం, శరణం గచ్చామి వారిచే జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీంరావ్ అంబేద్కర్, మాత రమాబాయిల జీవిత చరిత్ర నాటక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. అంబేద్కర్ పుట్టినప్పటి నుంచి వారి జీవిత ఘట్టాలను కళ్ల ముందు ఆవిష్కరించి, కుల వివక్షలు, కుల నిర్మూలన, అణగారిన వర్గాలపై జరిగిన అకృత్యాలు, వీటన్నింటి నుంచి ప్రజలను విముక్తులను చేసి, సర్వహక్కులు కల్పించేందుకు అంబేద్కర్ చేసిన కృషి అనిర్వచనీయమైందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పోరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి రవీందర్, దళిత సంఘాల నాయకులు వెంకటేశం, దశరథం, సమ్మయ్య, రాజమల్లయ్య, చరణ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నర్సింగాపూర్‌లో 'నా మట్టి–నా దేశం'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలం నర్సింగాపూర్ గ్రామంలో మేరీ మాటీ.. మేరా దేశ్(నా మట్టి.. నా దేశం) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ మట్టిని సేకరించారు. కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్లు గాదర్ల సతీశ్, రాయిని మల్లేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఆర్‌కేసీఓఏ క్లబ్‌లో ఈ నెల 17న నిర్వహించే చొప్పదండి దుర్గ స్మారక రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల పోస్టర్లను మంగళవారం స్థానిక ఆర్‌కేసీఓఏ క్లబ్‌లో ఆవిష్కరించారు. కళాకారులు అధిక సంఖ్యలో హాజరై పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

దండేపల్లి: అల్హాని తెలంగాణ కమ్యూనిటీ ఆధ్వర్యంలో దండేపల్లి మండలంలోని రెబ్బనపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 11మంది విద్యార్థులకు మంగళవారం సైకిళ్లను పంపిణీ చేశారు.

ఈవీఎంలపై అవగాహన

నెన్నెల: మండల కేంద్రంలోని దుబ్బపల్లి పాఠశాల ఆవరణలో మంగళవారం ఈవీఎం, వీవీప్యాట్‌లపై ఓటర్లకు అవగాహన కల్పించారు. కలెక్టరేట్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ చంద్రయ్య మాట్లాడుతూ.. ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరు గురించి వివరించారు.

పోస్టాఫీస్ పథకాలపై అవగాహన

చెన్నూర్: ప్రభుత్వం పోస్టాఫీసుల ద్వారా పలు ప్రజా ప్రయోజనాల కోసం పథకాలు, బీమాలు ప్రవేశపెట్టిందని పోస్టాఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామారావు అన్నారు. స్థానిక పోస్టాఫీసులో పోస్టాఫీస్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై మంగళవారం అవగాహన కల్పించారు.

నూతన నియామకం

బెల్లంపల్లి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కర్స్ కమిటీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాసిపేట మండలం సోమగూడెంకు చెందిన కంచర్ల అనిల్ నియామకమయ్యారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కట్కూరి సందీప్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు.

దిష్టిబొమ్మలు దహనం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు రాజకీయ పార్టీల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ ప్రచార కమిటీ సభ్యులు నందిపాటి రాజు, జంగెపెల్లి రామస్వామి, మేడి రాజు మాట్లాడుతూ.. తెలంగాణలో 07శాతం జనాభా లేని అగ్రకులాల వారు, 7రాజకీయ పార్టీల కు నాయకత్వం వహించడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో దళిత శక్తి కార్యకర్తలు, ధర్మసమాజ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో కోణంపేటకు రోడ్డు

నెన్నెల: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కృషితో కోణంపేటకు బీటీ రోడ్డు నిర్మించినట్లు మండల రైతు సమితి అధ్యక్షుడు అశోక్‌గౌడ్ అన్నారు. ఎర్రవాగు బ్రిడ్జి నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

జన్నారం: మండలానికి చెందిన పలువురు పద్మనాయక వెలమ సంఘం నాయకులు ఖానాపూర్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎంపీపీ సరోజన ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి భుక్య జాన్సన్‌నాయక్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

జగ్గయ్యపేటలో జ్వరాలపై సర్వే

భీమిని: మండలంలోని జగ్గయ్యపేటలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామంలో ఇంటింటా జ్వరాల సర్వే చేపట్టారు. అనుమానితుల వద్ద రక్త నమూనాలు స్వీకరించారు. అనంతరం రోగులకు మందులు అందజేశారు.

చీరలు పంపిణీ

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి, చింతపల్లి, తానిమడుగు, కుందేల్‌పహాడ్, నెల్కివెంకటాపూర్, నర్సాపూర్ గ్రామాల్లో కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మంగళవారం చీరలు పంపిణీ చేశారు.

'ఫిర్యాదు చేస్తే ఇంటి నంబర్ తొలగించారు'

బెల్లంపల్లి: తనకు చెందిన సింగరేణి కంపెనీ క్వార్టర్ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకుని అక్రమార్కులు గదిని నిర్మించారని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తే ఏమాత్రం పట్టించుకోకుండా ఏకంగా తన ఇంటి నంబర్‌ను ఆన్‌లైన్ నుంచి తొలగించారని బెల్లంపల్లికి చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు పి.లక్ష్మణ్‌రావు తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో గోడు వెళ్ల బోసుకున్నాడు. మున్సిపాలిటీలోని పోస్టాఫీసు బస్తీలో తనకు కంపెనీ క్వార్టర్ ఉందన్నారు. కంపెనీలో 35ఏళ్ల పాటు పనిచేసి 13ఏళ్ల క్రితం రిటైర్డు కాగా తన ఇంటి పక్కన నివాసం ఉంటున్న జానీమియా అనే వ్యక్తి, తానులేని సమయంలో తన ఖాళీస్థలాన్ని ఆక్రమించుకుని అడ్డుగా గోడ నిర్మించారని పేర్కొన్నారు. ఆ క్వార్టర్‌కు మున్సిపల్ ఇంటి నంబర్ కూ డా ఉందని తెలిపారు. మున్సిపాలిటీకి పన్నులు చె ల్లిస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.